# సుగంధి కుంతల

'ఈ ఊళ్ళో పెద్ద హోటలు ఏమిటోయి' అని అడిగాడు శేఖరం రిక్షా అతణ్ణి.

'ఉంటానికి తింటానికి సుగంధి విలాస్ బావుంటుందని చెప్పు కుంటారు బాబూ!' అన్నాడతను.

శేఖరం ఉలిక్కిపడ్డాడు. 'నీవీ ఊరివాడివేనా' అని అడిగాడు.

'కాదు బాబూ, దగ్గరలో ఉప్పలపాడు. ఐదేళ్ళనుంచి రిక్షా లాగుతున్నాను.'

'అయితే, ఆ హోటలు నీకెట్లా తెలుసు?'

'తమలాంటి ఆసాములందరూ చెప్పుకుంటూ ఉంటే తెలిసింది. అదీకాక, స్టేషను నుంచి చాలామంది అక్కడికే తీసుకొని పొమ్మంటూ ఉంటారు.'

'సరే. నన్ను కూడా అక్కడికే తీసుకొని వెళ్ళు.'

రిక్షాలో వెడుతుండగా ఆత్రంగా తనకు తెలిసిన ముఖం ఏదైనా కనిపిస్తుందేమోనని చూశాడు శేఖరం. పదహారేళ్ళకిందట తా నీ ఊరు విడిచిపెట్టి పోయినాడు. స్టేషన్ నుంచి ఊళ్లోకి వెళ్లే రోడ్డుకు రెండు పక్కలా తన చిన్నప్పుడైతే ఖాళీ స్థలాలుండేవి. ఇప్పుడవి ఏవీ లేవు. దేవతా టాకీస్ మారిపోయింది. దాని కెదురుగా ఉండే మునిసిపల్ పార్కు చాలా చిన్నదైపోయినట్లనిపిస్తున్నది. తన చిన్నతనంలో ఎంతో విశాలంగా ఉండేది. పార్కు ముందు గేటు దగ్గర చక్రకేళీ అరటి పండ్లు అమ్మే దానయ్య చాలా ముసలివాడైపోయినాడు. రిక్షా లోంచి చూస్తే అతడి పూర్వ రూపం మనసులో మెదిలింది శేఖరానికి.

సుగంధి విలాస్ చేరుకునేసరికి సాయంత్రం ఐదున్నరైంది. మనసంతా ఉద్వేగంతో ఉరకలు వేస్తున్నది. ఈసారైనా సుగంధిని తాను చూడగలడా? అందువల్ల తానాశించేది ఏమీలేదు. చూసి 'నన్ను గుర్తించావా?' అని అడిగితే చాలు. మరి పదేళ్ళు ఆ స్మృతిని పదిల పరచుకోగలడు. కిందటిసారి రాజు పేటలో ఎవరిని వాకబు చేసినా చెప్పలేకపోయారు.

రెండేళ్ళ కిందట ఒకసారి రాజు పేట వచ్చాడు శేఖరం, అక్క చనిపోయిందని తెలిసి. ఇహ లోకంలో ఆ అక్క ఒక్కతే తనకు చిట్ట చివరి బంధం. ఆ బంధం కాస్తా వదలిపోయింది. ఆ కబురు తెలిసిన మూడు నెలలకు కాని రాలేకపోయినాడు. నిజానికి అప్పుడు కూడా సుగంధిని ఓసారి చూడాలని పరితపించిపోయినాడు. తహ తహ లాడాడు.

రాజుపేట తన చిన్నప్పటి ఊరు కాదు. తన నెరిగిన వాళ్లూ ఎవరూ కన్పించలేదు. ఈ చివర నుంచి ఆ చివర దాకా ఊరంతా తిరిగినా తనను గుర్తుపట్టి మాట్లాడించినవాళ్ళే లేకపోయారు. కొందరి గురించి తానే వాకబు చేస్తే 'ఓహో! ఫలానివాడివా నువ్వు?' అన్నారు. తన తరం, తనతో స్కూల్లో, కాలేజీల్లో చదువుకున్న తన స్నేహితులు ఆ ఊరినుంచి చెల్లాచెదరై పోయినట్లుంది. వాళ్ళ కుటుంబాలు కూడా కనపడలేదు. కొన్ని వీధుల పేర్లే మరచిపోయినాడు.

ఈసారి హైదరాబాదులో పనుండి వచ్చాడు. ఒక నెలరోజులు ఈ దేశంలో గడపవచ్చు. సుగంధిని చూడగలిగితే ఈసారి తన రాక సఫలమైనట్లే!

కౌంటర్ దగ్గర పదిహేనేళ్ళ కుర్రాడు కూచుని వున్నాడు. 'సుగంధి నీకేమవుతుంది?' అని అడగాలనిపించింది. అలా అడగటం మర్యాద కాదేమో! హోటల్లో గది ఖాళీ ఉన్నా తనకు ఇవ్వనంటాడేమో!

'ఎన్నాళ్ళైంది ఈ హోటలు ప్రారంభించి?' అని అడిగాడు ఎంతో నిరాసక్తంగా శేఖరం. 'ఓ సంవత్సరం అవుతున్నది' అన్నాడా కుర్రాడు. నమోదు పుస్తకం తెరిచి ముందుకు తోశాడు. 'వారం రోజు లుండవచ్చుకదూ?' అని అడిగాడు. 'నెలరోజులుండండి - మాకేమి?' అన్నాడా కుర్రాడు. ఆ సమాధానం చెప్పే తీరు, కనుబొమలు ఎగరేయటం చాలా ముచ్చటనిపించింది శేఖరానికి. తక్కిన వివరాలు రేపు కనుక్కోవచ్చు. గదుల్లో అవీ ఇవీ అందించే పనివాళ్ల నడిగినా తెలుస్తుంది, అయ్యరుగారి ఊరూ పేరూ, ఇల్లూ వాకిలీ, పిల్లలూ భార్యా వైనం.

సుగంధి విలాస్ చిన్న హోటలే. కింది భాగంలో హోటల్, పైన పది గదులున్నాయి. రాజుపేట పెద్ద పట్నంకాదు. ఒక మోస్తరు టవును. ఇరవై ఏళ్ళ కిందట ఎంతో ప్రశాంతంగా ఉండేది. అప్పట్లో ఊళ్ళో బస చేయటానికి హోటళ్ళుండేవి కావు.

కిందటిసారి వచ్చినప్పుడు బావ చెప్పాడు- నాగార్జున సాగరం వచ్చింతర్వాత చుట్టుపక్కల పల్లెటూళ్లవాళ్లు బాగా ధనవంతులైనారు. సాయంకాలం టవునుకు వస్తారు. వాళ్ళకు వినోదం, విలాసం కావాలి. పెద్ద బజార్లో ఇరవై 'వైన్' షాపులు వెలిశాయి. తన చిన్నతనంలో ఒక్కటీ ఉండేది కాదు. తానీ ఊళ్లో బి.ఎ. చదువుకున్న రోజుల్లో కూడా ఇన్ని సినిమా హాళ్ళు లేవు. మద్యం అమ్మే షాపు ఒక్కటీ ఉండేది కాదు.

తన సూటూ బూటూ చూసి 'బాయ్' గదిలో దుప్పట్లు సర్దుతూ మంచినీళ్ల ఫ్లాస్కు అమరుస్తూ 'ఐసూ, సోడా, విస్కీ తెమ్మంటే తెస్తాను బాబూ, మంచి సరుకే దొరుకుతుంది' అని వినయం వొలక బోస్తూనూ, ఆసక్తికరంగానూ, జిజ్ఞాసతోనూ చెప్పాడు. 'అక్కరలేదు, దొరికితే మంచి ఇడ్లీ, కాఫీ పట్టుకురా' అని పురమాయించాడు శేఖరం.

ఈ సన్నివేశం చాలా ఆశ్చర్యమనిపిస్తున్నది శేఖరానికి. ఈ ఊళ్లో పది సంవత్సరాలు వారాలు చేసుకుని, ఆ ఇల్లాలు, ఈ ఇల్లాలు దయా దాక్షిణ్యాలపై ఆధారపడి చదువుకున్నాడు తాను.. ఒకరిద్దరు ఇళ్లలో నైతే బావినుంచి మంచినీళ్లు కూడా తోడిపెట్టేవాడు. ఇటువంటిది ఇవాళ తాను కలవాడికిందే లెక్క. ఇక్కడి రాబడితో పోలిస్తే, ఇక్కడి రూపాయల్లో లెక్కకడితే నెలసరి జీతం లక్ష రూపాయలు! ఈమాట వింటే తన బావకు గుండె ఆగిపోతుంది. తనకు వారాలిచ్చి ఆదరించిన ఆ తల్లులు ఇప్పుడు ఈ ఊళ్లో ఎవరూ కనపడలేదు కాని, ఈ విషయం తెలిస్తే చాలా సంతోషపడవచ్చు. మూర్ఛపోనూవచ్చు.

అమెరికా వెళ్ళిన తర్వాత తిథులూ, వారాలూ మరచిపోయాడు తాను. తన బావ రోజూ స్నానం చేసిన తర్వాత ఆ రోజు తిథి వారాలు మననం చేసుకునేవాడు. ఇవాళ పౌర్ణమి కాబోలు. ఎటు చూసినా పండు వెన్నెల. పిట్టగోడ నానుకొని వీధిలోకి చూశాడు. విద్యుద్దీపాలు వెన్నెల వెలుగులో వెలవెలబోతున్నాయి.

వెన్నెల లోకాన్నంతా సౌందర్యమయం చేస్తుంది. ఆనందమయం చేస్తుంది. వెన్నెల్లో ఇరుకు వీధిలోని మురికి కొంప కూడా భావనా నేత్రానికి పాతకాలపు కోటలా కనపడుతుంది. మురికి కాలవ కూడా తళతళ మెరిసిపోతుంది. ఇలాటి వెన్నెల రాత్రుల్లో శివాలయంలో ఒకరి వెనక ఒకరు ఎన్నిసార్లు పరుగులు తీశారు తాము. సుగంధిని ఎన్నిసార్లు తన చిన్నచేతుల మధ్య బిరికినా- రక్కినా విదిలించినా విసరికొట్టినా బంధించి ఏడిపించాడు తాను! రేపు ఒకసారి తప్పకుండా శివాలయానికి వెళ్ళి రావాలనుకున్నాడు శేఖరం. ఆలయంలో ప్రదక్షిణ మార్గంలో చిన్న పిళ్ళారి గుడి ఉంది. ఆ పక్కన మెట్లుదిగి కిందికి వెళితే నేలమాళిగలో ఒక చిన్న మండపం ఉండేది. దాంట్లో వెళ్లి తాను

దాక్కొనేవాడు. ఎంతో ప్రాధేయపడేది సుగంధి అందులోకి దిగవద్దని. పగటిపూట కూడా ఆ మెట్లు దిగటానికి భయపడిపోయేది. ఆ గుడి పక్కనే చిన్న పెంకుటింట్లో ఒక వాటాలో తన అక్కబావలతో తానూ, రెండో వాటాలో సీతారామయ్యగారూ వాళ్లూ ఉండేవారు. మెయిన్ రోడ్డుమీద సీతారామయ్యగారికి ఒక కాఫీ హోటలుండేది. వాళ్ళకు సుగంధి ఒక్కతేపిల్ల. అంబుజమ్మగారు తనను కూడా ప్రేమగా చూసేది. సీతారామయ్యగారు ప్రతిరోజూ తొమ్మిదింటికి ఇంటికి వస్తూ ఏదో 'స్వీటు' తీసుకొని వచ్చేవాడు. కిరసనాయిల్ బుడ్డిదీపం ముందు చదువుతున్నట్లు కునికిపాట్లు పడుతున్న తనముందు సుగంధి చడీ చప్పుడూ లేకుండా దేవతలా ప్రత్యక్షమయ్యేది. ఏ మైసూరుపాకు ముక్కో, లడ్డు ముక్కో తనకు అందించేది. ఉదయం, సాయంకాలం రెండు పూటలూ తామిద్దరూ కలిసే గుడికి వెళ్ళేవారు. ఇక కార్తిక మాసంలోనైతే నెల రోజులూ కోలాహలంగా పూజలూ, ఉత్సవాలూ, సభలూ, హరికథలూ, పురాణాలూ ఉండేవి. అలయ ఆవరణలోనే తాటాకు పందిళ్ళు వేసి 'అవతారాలని' దేవతల దివ్యమూర్తులు బంక మట్టిని చిన్న చిన్న కోపులుగా రంగురంగుల్లో అద్ది విశాలమైన చెక్క పలకపై చిత్రించేవారు. శనాదివారాల్లో ఆ చిత్రకారుడికి ఆ నెల రోజుల్లో తానూ, సుగంధీ సాయం చేసేవాళ్ళు.

ఇక ఏడాదికోసారి సుగంధి వాళ్ళ అమ్మమ్మ వచ్చేది. ఆమె వచ్చిందంటే సుగంధికి ఎంత సంతోషమో! ఆ'పాటీ' చాలా మంచిది. అక్కయ్యకి పనుల్లో ఎంతో సాయం చేసేది. 'ఇడ్లీ' ఎట్లా చెయ్యాలో, రకరకాల 'స్వీట్స్' ఏ విధంగా చెయ్యాలో దగ్గరుండి అక్కకు నేర్పేది. అక్క ఎప్పుడన్నా ఎవరింట్లోనైనా వంట చేయడానికి వెళు తుండేది. బావ సంపాదనలో ఇంటద్దె, తన చదువూ, తిండీ సాగేవి కావు. అందువల్ల తాను మూడు నాలుగు రోజులు వారాలు చేసుకొనే వాడు. ఎవరింట్లోనో తిని బడికి వెళ్ళేవాడు.

శేఖరానికి ఇరవై ఏళ్ళ, పాతికేళ్ళ కిందటి సంగతులన్నీ స్పష్టంగా నిన్న మొన్న జరిగినట్లుగా జ్ఞాపకం వస్తున్నాయి. సుగంధి వాళ్ళ అమ్మమ్మ అలగమ్మపాటి తనని ఓసారి బాగా కోప్పడి, కొట్టి నంత పనిచేసింది. సుగంధికి మిడతలంటే చాలా భయం. ఓసారి తన గుప్పెట్లో మిడతని చిక్కించుకొని 'ఇలా రా, నీకో మంచి రహస్యం చెపుతా'నని దగ్గరకు రాగానే సుగంధి మెడకింద ఆ మిడతని వదిలేశాడు తాను. కెవ్వున కేకపెట్టి ఓ గెంతు గెంతింది సుగంధి. అప్పుడెందుకో వరండాలో ఉన్న అలగమ్మ పాటి అది చూసింది. ఇంకా దీపాలు ముట్టించలేదు. సంజవేళ. ఎక్కడినుంచో ఓ బెత్తం లాంటిది తీసుకుని తనని వడ్డించటానికి వచ్చింది పాటి. బిక్క మొహం వేసుకొని పాటి వెనకనే వచ్చింది సుగంధి. తనని నాలుగు కొట్టినా ఫరవాలేదు కాని అక్కతో చెపుతుందేమోనని భయపడ్డాడు తాను. 'చెంపలు వేయవే' అని బలవంతాన సుగంధి చేత తన చెంపలు మీద కొట్టించింది పాటి. 'ఈసారి అట్లా మా అమ్మాయిని భయపెట్టావంటే లాగు విప్పదీయించి పిర్రల మీద కొడతాను' అని హెచ్చరించింది. రోజూ ఒక మిడత దొరికితే సుగంధిని ఏడిపించి ఆ పిల్ల చేత చెంప దెబ్బలు తింటే ఎంత బావుండు ననిపించింది శేఖరానికి. తన కప్పుడు పన్నెండేళ్ళుంటా యేమో! సెకండు ఫారం చదువుతున్నాడు. సుగంధికి తొమ్మిదేళ్లుంటా యేమో!సుగంధికి పుట్టింరోజు చేసేవాళ్ళు వాళ్ళ అమ్మా నాన్నా. ఎప్పు డైనా హోటలుకి తనతో తీసుకొని పోయేవాడు ఆ పిల్లని వాళ్ళ నాన్న. ఆ రోజున స్వీటుతోపాటు ఏ బూందో, కారప్పూసో కూడా తెచ్చేది తనకు సుగంధి.

అలగమ్మ పాటి మళ్ళీ ఊరికి వెళిపోతున్నదంటే సుగంధికి చాలా దిగులుగా ఉండేది. సుగంధి దిగులు పడటం చూసి తనకూ ఏమిటో వెలితిగా ఉండేది. అక్కడ తానున్న రోజుల్లో తప్పక సుగంధికి కొత్త బట్టలు కుట్టించేది వాళ్ళమ్మమ్మ. అవి వేసుకుని

దర్జాగా చలాకీగా తన ముందు తిరిగేది సుగంధి. తనకు కొంచెం ఉడుకుమోత్తనంగా ఉన్నా తాను చెప్పే కథలు వింటూ, తనతో ఆటల్లో తిరుగుతూ ఉండే సుగంధి పట్ల ఎంతో స్వతంత్రం చూపేవాడు తాను. 'ఏమిటే మగరాయుడిలాగా వాడితో తిరగటం' అని వాళ్ళమ్మా, అమ్మమ్మా కోప్పడినా ఆ బెట్టు నిలుపుకోలేకపోయేది సుగంధి. 'వెధవా, చదువుకోకుండా ఆడంగి రేకుల ఆటలేమిటిరా నీకు' అని తిట్టేది అక్క. బావ రోజూ పొద్దుపోయి ఇంటికి వచ్చేవాడు కాబట్టి కోడిగుడ్డు దీపం వత్తి బాగా తగ్గించి 'పాటీ'తో కబుర్లుపెట్టుకొనేది అక్క. బావ ఏదో ఆయిల్ మిల్లులో పని చేసేవాడు. లెక్కలన్నీ రాయంది వాళ్లు కదల నివ్వరనీ, చచ్చిపోతున్నాననీ ఇంటికి వచ్చింతర్వాత విసుక్కోవటం సాగించేవాడు. ఎంతరాత్రి ఇంటికి వచ్చినా బావి దగ్గర చేదతో నీళ్ళు తోడుకొని స్నానం చేస్తే కాని అన్నానికి లేచేవాడు కాదు.

వెన్నెల రాత్రులైతే పాటి తన మనవరాలికి ఏవేవో కథలు చెప్పి, అభినయిస్తూ ఉండేది. అరవం, తెలుగూ కలగాపులగంగా ఆవిడ కథలు చెప్పేది. తాను పుస్తకం ముందేసుకుని కూచున్నా ధ్యాసంతా అటే ఉండేది. రెండు గదుల వాటా ఒక్కొక్కటికీ ఉమ్మడి వరండా బారుగా ఉండేది. వెన్నెల వస్తే ఆ వరండా అంతా చందమామ దేని కోసమో వెతుక్కుంటున్నట్లుండేది. అప్పుడప్పుడు చేతులూ కాళ్లూ ఇలా ఇలా ఉండాలని ఏవో డ్యాన్సు భంగిమలు నేర్పించేది వాళ్ళ అమ్మమ్మ. 'ఆడువోమే వలిపాడువోమె, ఆనంద సుగందీరం' అని పాట పాడి ఇలా ఇలా చేతులు తిప్పమనేది. తాను దొంగచూపులు చూస్తూ ఏదో పని ఉన్నట్లు వరండాలోకి వస్తూ ఉండేవాడు శేఖరం. సుగంధి సిగ్గుపడి నవ్వి అభినయం ఆపేసేది.

ఒక్కొక్క దృశ్యం తన కళ్ళముందు అప్పుడే జరుగుతున్నట్లు ఉద్వేగం కలుగుతున్నది శేఖరానికి. 'సార్, పది తర్వాత భోజనం

దొరకదు ఈ ఊళ్లో. పక్కనే కోమలవిలాస్ నుంచి భోజనం తెమ్మంటే తెస్తాన్ సార్! అక్కడ భోజనం బాగా ఉంటుంది' అంటూ వచ్చాడు కుర్రాడు.

సినిమాహాలు దగ్గర నాయర్ టీ కొట్టుకి వెళ్ళి మంచి టీ తాగి రావాలనిపించింది శేఖరానికి. అక్కడ మంచి అరటిపళ్ళు దొరుకుతాయి. అప్పుడే తొమ్మిది గంటలు కావస్తోంది. తను చదువుకునే రోజుల్లో అయితే మొదటి ఆట సినిమా వదిలిపెట్టే టైము అది. 'భోజనం అక్కరలేదులే. అట్లా పార్కు దాకా వెళ్లి పండ్లేమైనా కొనుక్కొని వస్తాను' అని చెప్పాడు శేఖరం. 'నేను తెచ్చిపెట్టేదా సార్?'అని అడిగాడు హోటల్ కుర్రాడు. 'కాదులే, ఈ ఊరు ఎంత మారిపోయిందో చూడాలని ఉంది. సినిమాహాలు పక్కనే ఉండే నాయర్ టీ బంకు ఉందా ఇంకా?' అని అడిగాడు శేఖరం.'నాయరెప్పుడో సచ్చిపోయిండు కదా సార్, ఐదేళ్ళవుతున్నది' అన్నాడు హోటల్ కుర్రాడు. 'అలానా పాపం! అలా చెరువుకట్ట వీధి దాకా వెళ్లొస్తాను. అవునుగానీ మీ అయ్యరుగారి ఇల్లెక్కడోయ్?'

'కిందటి సంవత్సరమే కాదుటండీ ప్రకాష్‌నగర్‌లో పెద్ద డాబా కట్టినారు. అప్పటిదాకా కోమటి వీధిలో రాములోరి గుడి పక్క పెంకుటింట్లోనే ఉండేవాళ్ళు. అయ్యగారికి బాగా కలిసొచ్చినాది. నిమ్మతోట కాడ సినిమా హాలులో భాగం కూడా తీసుకున్నారు నిరుటేడు. రోజూ సాయంతరం సినిమా హాలుకాడికే వెల్తుంటారు. చిన్నయ్య కాస్త ఎక్కి వచ్చింతర్వాత హోటల్ బిజినెస్సు ఆయనే చూసుకుంటున్నారు.'

'అమ్మగారెప్పుడైనా హోటల్‌కి వస్తూంటుందా?' అడిగాడు శేఖరం. హోటల్ కుర్రాడు పక పక నవ్వాడు. 'ఆమె కేం కర్మండీ! కొత్త సినిమా రావడమే ఆలస్యం- రిచ్చాలో అయ్యర్‌గారితో సినిమా

వెల్తారు. అయ్యర్‌గారికి కారు ఖరీదు చేదామని ఉంది. మంచి బేరం తగలక ఆలోచనసేస్తా ఉండారు '

శేఖరం మనస్సు హాయి హాయి అని తేలిపోయింది. ఎంతో ఆనందం కలిగింది. 'అయితే ప్రకాశ్ నగర్‌లో ఎక్కడయ్యా అయ్యర్ గారిల్లు? నే నీ ఊరి వాణ్ణేలే. చాలా రోజుల కిందట ఉద్యోగం కోసం ఢిల్లీ వెళ్ళిపోయాను. ప్రకాశ్ నగర్‌లో మా బంధువులు కూడా ఉన్నారు'.

'ఎవర్నడిగినా చెపుతారు- సుగంధి విలాస్ అయ్యర్ గారి ఇల్లెక్కడాండీ? అని అడిగితే. రైలు గేటు నుంచి దిగూకు పోగానే మర్రి చెట్టు దాటి చక్కంగా పోవాలి. బమ్మాండమైన డాబా రహదారి లోనే ఉంది.'

శేఖరం మనస్సు తేలికపడింది. 'ఇప్పుడే ఓ అరగంటలో వచ్చే స్తాను' అని హోటల్ మెట్లు దిగి స్టేషన్ రోడ్డు మీదికి వచ్చాడు. రోడ్డంతా జన సంచారం లేక ఖాళీగా ఉంది. ఎడంవైపున తాలూకా కచ్చేరి ఆఫీసు ఉన్న విశాలమైన ఆవరణలో చింత చెట్లమీద వెన్నెల తళ తళ లాడిపోతున్నది. దేవతా టాకీసులో రెండో ఆట సినిమా అప్పుడే మొదలైనట్లుంది. వేరుశెనగక్కాయ లమ్మేవాళ్లూ, ముంతకింద పప్పు అమ్మేవాళ్లూ విశ్రాంతిగా ఉన్నారు. నిశ్శబ్దంగా ఉన్నాయి పళ్ళ కొట్లూ, కిళ్ళీ కొట్లూ. సోడా బండి రామయ్య చాలా ముసలివాడై పోయినాడు. అయినా, అతడు సోడా బండి ఇంకా నడపటం చాలా ఆశ్చర్యమనిపించింది శేఖరానికి.

ఇంకా పాతకాలపు వాసనలు పోలేదు పాత కాలపు ఆ సినిమా హాలుకు. ఇంకా రేకుల హాలే అది. సినిమాలో పాత్రల ఆట పాటలు అస్పష్టంగా బయటకు కనబడుతూ, వినపడుతుంటాయి. చిన్నతనంలో

నైతే ఆ బొమ్మలు కనపడతాయేమోనని ఆత్రంగా కాళ్ళు నిక్కించి, చెవులు రిక్కించి అప్పుడప్పుడు అక్కడ నిలబడుతూ ఉండేవాడుతాను.

కాసిని అరటి పళ్లు కొనుక్కొని మళ్ళీ హోటలుకు వచ్చేశాడు శేఖరం. మెట్లెక్కుతూ కౌంటర్ దగ్గర చూశాడు. ఇంకా ఆ పిల్లాడే కూచుని ఉన్నాడు. హోటలంతా నిశ్శబ్దంగా ఉంది. పనివాళ్ళు కూడా పడుకోవటానికి వెళుతున్నారు పక్క బట్టలూ చాపలూ సర్దుకుంటూ. ఆ పిల్లాడి పేరు కనుక్కోవాలనిపించింది శేఖరానికి. అడిగితే బాగుండదేమో! ఏదైనా నెపం పెట్టుకుని అడగాలి. మెట్లు దిగి ఆ పిల్లాడిదగ్గరకు నడిచాడు శేఖరం. 'ఏమండీ, మధ్యలో మంచినీళ్ళు కావల్సి వస్తే మీ 'బాయిస్' ఎవరైనా వస్తారా? బెల్లు ఉందా రూముకు?' అని అడిగాడు. 'ఉంది. నాకు వినపడుతుంది. ఏమిటో కనుక్కోమని నేను పంపిస్తాను' అని చెప్పా డాకుర్రాడు. 'మీ రిక్కడ ఎంతదాకా ఉంటారు?' 'పన్నెండు దాకా.'అంత చిన్నతనంలో అంతగా కష్టపడటం ఆశ్చర్య మనిపించింది శేఖరానికి. వ్యాపారం అంటే కాదే కాబోలు! ఇంత చిన్నప్పుడే ఈ అబ్బాయికి ఎంత నిష్ఠ, ఎంత తాపత్రయం అనిపించింది శేఖరానికి. 'మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?' 'ఎందుకు తెలుసుకోకూడదు?' అని చురుకుగా నవ్వి 'కణ్ణన్ అంటారండీ!' 'ఇక్కడ మంచి సినిమాలేమైనా ఆడుతున్నాయా? హాలు మంచిదేదైనా ఉందా? నే నీ ఊరివాణ్ణే లెండి. పదిహేనేళ్ళకింద ఈ ఊరు విడిచిపెట్టి పోయాను. దేవతా టాకీస్ నాకు తెల్సు. ఆ కంపు భరించలేం. మంచి సినిమా ఏదైనా ఆడుతుంటే చెప్పండి, రేపు ఫస్ట్ షోకి వెళతాను.'

కణ్ణన్ బుగ్గలు పొంగాయి. 'రేపు అలంకార్‌లో కొత్త సినిమా వస్తోందండీ. మీకు టికెట్ కావాలంటే నేను తెప్పించి పెడతాను. నేను రేపు వెళతాను. మా అప్ప హోటలులో కూచుంటామన్నారు. అయినా పది గంటల కల్లా వచ్చేస్తాగా. చెప్పండి మీకు టికెట్ కావాలంటే.'

'ఆ సినిమాహాలు వాళ్ళు మీకు తెలుసా?'

'అదంతా మీకెందుకు? మంచి సినిమా అంటున్నారందరూ. మా అమ్మా, అప్పా వెళతామంటే- రేపు కాదు ఎల్లుండి మీరు వెళ్ళండి అని నేనే వొప్పించాను. మొదటిరోజు మొదటి ఆట చూడటమంటే మా అమ్మకూ, నాకూ బలే సరదా. మీరు వస్తామంటే నాతో రావచ్చు రేపు' అని చెప్పాడు కణ్ణన్.

'రేపు పొద్దున చెపుతానులే. మా బంధువుల ఇంటికి వెళ్ళి రావాల్సి ఉంది. ఆ ప్రోగ్రాం గనక సాయంకాలానికైతే రేపు రాలేను. అయినా ఇక్కడ నేను వారం రోజులుంటాను కదా!' అని ఆ పిల్లాడి చేతిని తన చేతిలోకి తీసుకొని ఊపి తన గదిలోకి వచ్చాడు శేఖరం.

రెండు అరటిపళ్లు తిని నిద్రపోదామని పక్కమీద జేరబడ్డాడు. అయితే, నిద్ర ఎంతకూ దరికి రాలేదు. కణ్ణన్ చాలా ముద్దొస్తున్నాడు. ఆ కళ్లూ ముక్కూ అచ్చం తల్లి పోలికే. అయ్యర్ గారెలా ఉంటారో? రేపు పొద్దున్నే చూడొచ్చుగా!

ఎంతకీ నిద్ర పట్టదు. అలగమ్మ పాటీ లేత ఎరుపు రంగు పంచ చీరలాగా కట్టుకొని దాన్నే నెత్తిన ముసుగు వేసుకొనేది. చచ్చి ఎన్నాళ్ళైందో - కళ్ళ ముందు స్పష్టంగా కదలాడుతున్నది. ఆమె ఆ రోజున చచ్చిపోకపోయినట్లైతే కథ ఎలా ఉండేదో!

తాను డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగానే టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం వచ్చింది. సుగంధి తనతో ఇల్లు విడిచి వెళ్ళటానికి సిద్ధపడింది. వారం రోజులు ఎంతో బాధపడింది. దిగులు పడింది. తానెంతో ధైర్యం చెప్పాడు. తానిక ఇంట్లోనే ఉంటే ప్రమాదం ముంచుకొని వచ్చేట్లుంది. అక్కా బావలు తనకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కట్నం పేరుతో వీలైనంత రాబడదామని ఒకటే ఇద్దై

పోతున్నారు. తనకి ఉద్యోగం కూడా వచ్చింది కదా! బేరాలు అంత కంతకీ ఎక్కువవుతున్నాయే కాని తగ్గటం లేదు.

సుగంధిని బతిమాలాడు; బామాలాడు. 'నీవు నాతో రాకపోతే బతికినంత కాలం నాకిక పెళ్ళేవద్దు' అన్నాడు. 'నీవు నాదేవతవి నేను నీ భక్తుణ్ణి. రుజువు కావాలంటే నీ కాళ్ళకి దణ్ణం పెడతాను' అని మురిపించాడు. ఎన్నెన్ని ఒట్లో, ప్రమాణాలో, ఎన్నిసార్లు గొంతు బొంగురు పోవడాలో, కళ్లు చెమ్మగిల్లటాలో ఇద్దరికీ. అయితే, రాత్రి పదిగంటలకు మానామదురైనుంచి టెలిగ్రాం - అలగమ్మ ఇహలోకం విడిచింది అని. అంబుజమ్మగారి శోకాలు. తన గుండె పగిలిపోయింది.

రాత్రికి రాత్రి బయలుదేరి వాళ్లు వెళ్లిపోయారు. సుగంధితో తనకు చివరిసారి మాట్లాడటానికి కూడా అవకాశం లేకపోయింది. అక్కడే పెళ్ళి కూడా జరిపి, నెల రోజుల తర్వాత అల్లుణ్ణి ఇల్లటం తెచ్చుకుని రాజుపేట వచ్చేశారు. సుగంధి పెళ్ళి సంగతి సీతారామయ్య గారు బావకి ఉత్తరం రాసినప్పుడే తనకి జీవితంమీద విరక్తి కలిగింది. ఎందుకు? ఎందుకు? ఎందుకిలా అయింది? తాము ఇంట్లోంచి వెళ్ళిపోయిన తర్వాత ఆ టెలిగ్రాం వచ్చి ఉంటే ఏమైఉండేది! సుగంధి తమని విడిచిపెట్టి వెళ్ళిపోయిందని తెలిస్తే వాళ్ళ ప్రాణాలేమై ఉండేవో! అలగమ్మపాటికి సుగంధిపైనే పంచప్రాణాలు. సుగంధిని రక్షించటానికే చచ్చిపోయిందేమో!

అమ్మ నాన్నలకి సుగంధి ఒక్కతే కూతురు కదా! ఆ బిడ్డ పుట్టటానికి ఎన్ని మొక్కులో, ఎన్ని తీర్థయాత్రలో చెపుతుండేది అలగమ్మపాటి. అక్కకి పెళ్ళైన పదేళ్ళవరకు పిల్లలు పుట్టలేదు. ఆ సందర్భంగా ఎన్నెన్నో సలహాలు చెపుతుండేది ఆమె. తర్వాత అక్కకి పురుడు వచ్చినప్పుడు అలగమ్మగారు రాజుపేటలోనే ఉండటంతో తమ కుటుంబాన్ని ఎంతో ఆదుకున్నది. బావకీ తనకీ ఆ పది రోజులు అలగమ్మగారే వండిపెట్టింది.

సుగంధి పసితనం గూర్చి చెపుతుండేది అలగమ్మ పాటి. 'ఈ పేరెందుకు పెట్టామో తెలుసా! నువ్వెప్పుడైనా అటువేపురా. నేను తీసుకొని వెళ్లి చూపిస్తాను. తాయిమాన్‌వర్ - తానే తల్లి అయిపురుడు పోసిన దేవుడు. ఒక భక్తురాలుండేది. ఆమె కడుపుతో ఉంది. నొప్పు లొస్తున్నాయి. కిందటి రోజే చేరాల్సిన తల్లి ఇంకా రాలేదు. అప్పుడేం జరిగిందో తెలుసా? ఆ మాతృభూతేశ్వరుడే తల్లి అయివచ్చి పురుడు బోసిపోయినాడు. ఇది ఎలా తెలిసింది? పురుడొచ్చిన మర్నాడు తల్లి వచ్చి అమ్మా ఏరు పొంగి రాలేకపోయినాను. నా ప్రాణాలన్నీ కొట్టుకు లాడిపోయినాయి, ఏక్షణాన పురుడొస్తుందోనని, అంటే అదేమిటే అలా అంటావు? నిన్న నీవే కదా నా దగ్గరున్నది' అన్నది శివ భక్తురాలు. అప్పుడు తల్లీ కూతుళ్ళిద్దరు స్వామి దయకు కరిగిపోయినారు. అదుగో ఆ మాతృభూతేశ్వరుడి ఇల్లాలే సుగంధికుంతలాంబ. దయగల తల్లి. తిరుచినాపల్లి కొండపైన ఆమె నిలయం. సుగంధి కుంతల అంటే శివ గామి. మా అమ్మాయి కి పేరు పెట్టాం' అని వర్ణించి చెపుతుండేది అలగమ్మ. ఆమె కెన్నో పాటలు వచ్చు. ఎప్పుడూ ఏదో పాట పాడుతూనే ఉండేది.

ఆ తర్వాత సుగంధి కుంతలను గూర్చి తెలుగు పుస్తకంలో ఒక కథ చదివాడు. క్లాసులో లెక్చరర్‌గారు రాగాలు తీస్తూ ఆ కథ చెప్పేవారు ఓసారి దక్షిణదేశంలో మనిషిని పీక్కొని తినే కరు వొచ్చింది. శివాలయానికి తాళం పెట్టి తిరునల్లూరులో ఒక పూజారి 'మహాప్రభూ, నేను వెళతాను. మళ్ళీ బతికుంటే వస్తాను' అని మహా దేవుడికి విన్నవించుకున్నాడు. శివుడు నవ్వి భలేవాడివయ్యా- ఒక పద్యం ఇస్తాను. రాజుగారి దగ్గరకు వెళ్ళి ఆ పద్యం చదువు. నీ కవిత్వానికి మెచ్చి ఆయనేదో బహుమానం ఇస్తాడు - బతకవచ్చు' అని చెప్పాడు. ఆ పద్యం తీసుకుని రాజుగారి కొలువుకి వెళ్ళాడు పూజారి. అక్కడో తిక్క కవి ఉన్నాడు అతడి పేరు

నక్కీరుడు. శివార్చకుడు వచ్చి పద్యం చెప్పగానే నక్కీర కవి ఆక్షేపించాడు. 'ఏమయ్యా, నీవు నీ పద్యంలో ఒక అతిలోక సుందరిని వర్ణించావు. బాగానే ఉంది కాని, ఆవిడ సహజంగానే సుగంధ కుంతల అన్నావు. ఈ విడ్డూరం ఎక్కడైనా ఉందా? సహజంగా ఏ స్త్రీ కేశపాశమూ సువాసనాభరితంగా ఉండదు. ఇంతమాత్రం తెలీని నీవు ఏం కవివి?' అని నవ్వాడు. శివార్చకుడి ముఖం చిన్నబోయింది. కొలువులోని వాళ్ళంతా పక పక నవ్వారు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత ఉక్రోషం కలిగింది ఆ శివ పూజాపరుడికి. 'చాల్లే నీ నిర్వాకం' అని ఆ పద్యం తీసుకెళ్ళి 'నీవే ఉంచుకో' అని ముఖాన కొట్టినంత దురుసుగా నల్లూరిలో శివుడికే ఇచ్చేశాడు అర్చకుడు. "ఏమిటేమిటి? ఈ పద్యంలో తప్పు పట్టాడా? వాడి కడుపు మాడ. నేనూ వస్తాను పద. ఏమిటో తప్పు. వాడి చమడాలు ఎక్కదీస్తాను. పోదాం పద-'' అని అర్చకుణ్ణి వెంటబెట్టుకుని రాజ సభకు వచ్చాడు పశుపతి. 'ఏమిటయ్యా ఇందులో తప్పు' అని నక్కీరుణ్ణి నిలదీశాడు. 'ఎంత సొగసైన తలకట్టైనా సహజంగా సుగంధ బంధురంగా ఉంటుందా? ఏదో దోహదం చెయ్యకుండా అలా ఉండటానికి వీల్లేదు. అది కవి సమయం కాదు' అన్నాడు నక్కీరుడు. 'ఓరి వాజమ్మా! పార్వతి వేనలి ఎప్పుడూ ఘుమ ఘుమ లాడుతుందిరా' అన్నాడు కవి వేషధారి శివుడు. 'శైల బాల కేశపాశం సంగతి నా కెందుకు! నీ కెందుకు? మధ్య అన్నాడు నక్కీర కవి ధూర్తుడు. అప్పుడు ధూర్జటి సూచనగా తన మూడో కన్ను చూపించాడు. అంతటితోనైనా బుద్ధి తెచ్చుకోక ఆ నక్కీర పిచ్చి కవి బడాయిగా 'మూడు కళ్ళు కాదయ్యా ముప్పై కళ్ళు చూపినా తప్పు తప్పే' అన్నాడు. సరే, అరే నీ మంకుతనం అనుభవించు- అని శివుడు వెళ్ళిపోయినాడు, తన పూజారి చేయిపట్టుకుని.

ఈ కథ చెప్పి సుగంధి తలను ఎన్నిసార్లు ముద్దుపెట్టుకొన్నాడో తాను. నీవు నిజంగా హైమవతివే అనేవాడు. 'అమ్మో, అలా అనకూడదు. అమ్మవారికి కోపం వస్తుంది, అని కలకల నవ్వేది సుగంధి.

రాత్రి అంతా కలలు. ఆలాపనగా నిద్ర పట్టీపట్టకుండా గడిపే శాడు శేఖరం.

ప్రొద్దున ఆలస్యంగా లేచాడు. అప్పటికే రెండుసార్లు హోటల్ బాయి వచ్చి లేపాడు. టిఫినూ కాఫీ తెప్పించుకునేకంటే కిందికే వెళితే అయ్యర్‌గారిని చూడవచ్చును కదా అని కుతూహలంగా కిందికి దిగాడు. అయ్యర్‌గారు పచ్చని పసిమి. ముఖంమీద కుంకుమబొట్టు మెరిసి పోతున్నది. ఒక బుగ్గన ఉబ్బెత్తుగా తాంబూలం. మెడలో రుద్రాక్ష మాల. అన్నిటికన్నా నవ్వు తెప్పించేట్లు నడి నెత్తినుంచి గుబురువెంట్రు కలు చుట్ట చుట్టి వెనక్కు వేశ్నాడే ముడి. తలమీద ముందు సగభాగం డిప్పకొట్టించేశారు. తళతళ లాడుతున్న నున్నటి సగం తల.

'మీరేనా రాత్రి ఆరో రూములో దిగిందీ?' అని పలకరించాడు అయ్యరుగారు. 'సాయంత్రం సినిమాకు పోదురా? టికెట్ తెప్పిస్తును.' 'కణ్ణన్ చెప్పాడా?' 'ఆమా! నేను ఇవాళ సినిమా హాలుకు పోను. రేపు పోతాను'

'కణ్ణన్ ఇవాళ వెళతానన్నాడు. వాళ్లమ్మగారు కూడా వెళతారని చెప్పాడు.'

'అబ్బే, ఇమె ఇవాళ పోదు. మీరు కణ్ణన్‌తో పోవచ్చును. వాడు సాయంత్రం ఇక్కడినుంచే పోతాడు' అని చెప్పాడు అయ్యరుగారు.

"సరే చూదాం. నేను సాయంత్రం మా బంధువు లింటికి వెళ్ళాలనుకుంటున్నాను. అక్కడికి వెళ్ళకపోతే సినిమా ప్రోగ్రాం పెట్టుకుంటాను. ఆరింటికి మీకు చెపుతాను లెండి. ఆరింటికల్లా మీరిక్క డికి వచ్చేస్తారు కదా!"

'ఓ వస్తాను. కణ్ణన్ సినిమాహాలు నుంచి ఇటే వస్తాడు. అప్పటి దాకా నేను ఇక్కడే ఉంటాను.'

'బాగుంది.'

శేఖరం టిఫిన్ చేసి కాఫీ తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయి నాడు. ఇవాళ అదృష్టం కలిసొచ్చి సుగంధిని చూడటం జరిగితే తానెంతో అదృష్టవంతుడే అనుకున్నాడు. ఆ పగలంతా అతడి కెక్కడికీ పోవాలనిపించలేదు. తాలూకాఫీసుకు కుడివైపున సందులో మునిసిపల్ లైబ్రరీ ఉంది కాని, ఉదయం పదకొండు కాగానే మూసివేస్తారు. ఇక తాను ఎక్కడికీ వెళ్ళేది లేదు. ఎవరూ గుర్తు పట్టి పలకరించరు. అప్పుడే ఈ ప్రాంతంలో బాగా ఎండలుకూడా ముదిరినట్లున్నది. రాత్రి ఎలాగూ నిద్రపట్టలేదు. మధ్యాహ్నం ఆ కోమల విలాస్‌కి వెళ్ళి భోజనం చేసి హాయిగా ఓ కునుకు తీస్తే సరి అనుకున్నాడు శేఖరం. ఈ ఊళ్లో ఇక తాను చూడాల్సిందల్లా చెరువుకట్ట పక్క శివాలయాన్నే. అంతకు తప్ప ఈ ఊళ్లో ఎక్కడికని వెళ్ళగలడు?

సాయంకాలం ఐదుకల్లా శుభ్రంగా తాజాగా తయారైనాడు స్నానం కూడా కానిచ్చి. మనసు ఒకవైపున చాలా ఉద్వేగభరితంగా ఉంది. సుగంధి తనను గుర్తుపట్టకపోవచ్చు. అయితే ఏం? తానే పరిచయం చెప్పుకుంటాడు.

రిక్షాలో వెళుతుంటే ఆ రిక్షాకంటే తానే ముందుగా పరిగెత్తుతున్నట్లనిపించింది. రైలుగేటు దాటి దిగువకు రిక్షా పల్లంలోకి జారగానే ఆత్రుత ఎక్కువైంది. మర్రిచెట్టు దాటగానే రిక్షా దిగి, అతణ్ణి పంపించేశాడు. చాలా ఎత్తైన పునాదిమట్టం మీద నవనాగరికంగా డాబా ఇల్లు కనపడుతున్నది. సులభంగానే పోల్చుకున్నాడు.

వరండాలో ఎవరో పనివాడు కాబోలు- హోటలుకు పట్టుకొని వెళ్లాల్సిన సరంజామా ఏదో సిద్ధం చేసుకుంటున్నాడు. 'అయ్యగారున్నారా?' అని అడిగాడు శేఖరం. 'లేరు. హోటలుకాడి కెళ్ళిపోయినారు' అని చెప్పాడతడు.

'అమ్మగారున్నారా? ఉంటే లోపలికెళ్ళి మీ బంధువులొచ్చారని చెప్పు.'

సుగంధి వాకిలి తెరతొలగించుకుని చూసింది.

నిబ్బరంగా శేఖరం మెట్లెక్కి గుమ్మందాకా చేరుకున్నాడు.

'ఎవరు? ఎవరికోసం?' అని అడుగుతోంది సుగంధి.

'నన్ను గుర్తుపట్టలేదా సుగంధీ? నేను శేఖరాన్ని. మా అక్కయ్య భ్రమరాంబ.'

'ఓ! శేఖరం, నువ్వా, ఎప్పుడొచ్చావు, ఎక్కడ దిగావు? నీ పెట్టీ బేడా ఏవీ? నేరుగా ఇక్కడకే రావల్సింది.'

హమ్మయ్య అని నిట్టూర్చాడు శేఖరం.

'నేనొక పావుగంట ఉండిపోతాను. నీకు ఇష్టమేనా?'

'అదేమిటి శేఖరం. నువ్విక్కడే ఉండిపో. మావారొచ్చిన తర్వాత భోంచేసి వెళుదువుగాని, అంతగా వెళ్ళక తప్పకపోతే.'

సుగంధికి బాగా వొళ్లొచ్చి నేవళం తేలింది. హాల్లో ఉయ్యాల బల్లపైన జాజిపూలు కుప్పగా పోసి ఉన్నాయి. వేలెడంత మాల తయారైంది. ఆ పువ్వులు పమిట చెరగులోకి కట్టిన మాలతో సహా తీసుకుని 'అలా ఉయ్యాల బల్లమీద కూచో' అని కళ్ళతోనే చెప్పింది. చప్పున లోపలికి వెళ్ళి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. 'ఇప్పుడెక్కడుంటున్నావు? అసలీ దేశంలోనే ఉన్నావా? ఏం ఉద్యోగం? పిల్లలెంతమంది?' అని ఆప్యాయంగా అడిగింది. దగ్గరగా చూశాడు శేఖరం. ఆమె నడుం దగ్గర ముడతలు వింత అందాన్నిస్తున్నాయి. జుట్టు కాస్త కాస్త తెల్లబడుతున్నది. చిన్నప్పుడు లేని ముక్కుపుడక, చెవులకు రవ్వల దుద్దులు.

'నీకెంతమంది పిల్లలు సుగంధీ?' అని అడిగాడు శేఖరం.

'ఒకమ్మాయి, ఒకబ్బాయీ. అమ్మాయి చిన్నది. దాని పేరు కాంతిమతి. నా కొడుకు పేరు కణ్ణన్. వాళ్ళ నాన్నకి ఈ పేర్లు చాలా ఇష్టంట. అందుకని ఆయన సెలక్షనే. నీవు చాలా మారిపోయినావు సుమా! బాగా ఒడ్డూ పొడుగూ ఎక్కావు. బుగ్గ మీద ఆ గాటు పడిన మచ్చను పట్టి పోల్చుకోగలిగాను. లేకపోతే నువు చెప్పినా నమ్మలేక పోయి ఉందును. ఇంతకూ నీ సంగతి చెప్పవేం? ఇన్నేళ్ళ తర్వాత ఈ ఊరు రాక రాక వచ్చావు కదా, మీ ఆవిడనూ పిల్లలనూ కూడా తీసుకొని వస్తే సరిపోయేది కదా?'

తమ మధ్య ఏదో పెద్ద అఘాతం ఉన్నట్లు ఈ పొడి పొడి మాటలు ధ్వనించాయి. అసహనం, విసుగూ అనిపించిందతడికి.

"నేను పెళ్ళి చేసుకోలేదు. మద్రాసులో ఉద్యోగం చేస్తూనే పై చదువులు చదివి అమెరికా వెళ్ళిపోయాను. రెండేళ్ళ కిందట అక్క పోయినప్పుడు వచ్చాను కాని, నీ సంగతి ఎవరూ చెప్పలేదు. మా బావ నడగలేదు నేను, ఆయన ఏడుపుతో అయ నున్నాడు కదా అని. నేను నిన్ను చూదామనే ఈసారి ఈ ఊరొచ్చాను. నిన్ను చూడగలిగాను. చాలు. ఇలా మాట్లాడటం నీకు ఇష్టం అనిపించకపోవచ్చు. కష్టం కూడా కలిగించవచ్చునేమో! అయినా, నేను ఎల్లుండి వెళ్ళిపోతున్నాను. రేపు సాయంకాలం శివాలయానికి వెళ్ళటమే నాకి ఊళ్లో ఇంకా మిగిలి ఉన్న పని. నేను మీ హోటలులోనే దిగాను. మీ ఇల్లు కనుక్కున్నాను" సుగంధి ముఖం చిన్నబోవటం శేఖరాని కెంతమాత్రమూ ఇష్టం లేదు.

'ఈ కాసేపు చిన్నప్పటి చిలిపి పనులు గుర్తు చేసుకుందాం. మరిక ఎప్పుడొస్తానో, అసలు రానే రానో. నువ్వు కోపం తెచ్చుకో నంటే ఒకటి అడుగుతాను. నాతో ఇప్పుడు వచ్చేయమనటంలేదులే. హాస్యానికి కూడా అనను. అంత బుద్ధిహీనుణ్ణి కాను.'

ఇంతలో అమ్మా అంటూ కాంతిమతి వచ్చింది. ఎనిమిదీ లేక పోతే తొమ్మిదేళ్ళుంటాయేమో! అపరిచిత వ్యక్తిని చూసి గుమ్మంలోనే

ఆగిపోయింది. కళ్ళు విప్పార్చుకుని, బుగ్గ లోపల నాలుకతో తడుతూ ఎవరమ్మా అంటున్నట్లు చూసింది.

'దా అమ్మా దా. మామకి నమస్కారం చెయ్యి' అని గారాబం చేసింది సుగంధి. ఆ పిల్ల నవ్వు మొహంతో తల్లిని వాటేసుకుని ఆమె కడుపులో ముఖం దాచుకుంది.

'అచ్చం నీ పోలికే. చిన్నప్పుడు నువ్వు అంతా ఇలానే ఉండే దానివి. మీ అమ్మాయికి కూడా మిడత అంటే భయమేనా? ఇప్పుడో మిడత దొరికితే బావుండు. నీ చేత చెంప దెబ్బలు తినటానికి!'

గోముగా నవ్వింది సుగంధి. 'ఇంకా అవన్నీ నీకు జ్ఞాపకం ఉన్నాయే-' వేళ్ళ మీద లెక్క వేసుకుంటూ 'పాతికేళ్ళు గడిచాయి' అంది.

"ఆడవాళ్ళు దేన్నైనా మరచిపోగలరు. అది వాళ్ళకు దేవుడిచ్చిన వరం."

"నీకు సంసార జంజాటం లేదు కాబట్టి ఎన్నైనా మాట్లాడ వచ్చు. అదిసరే కాని శేఖరం, నువు మంచిపిల్లను చూసి పెళ్ళి చేసుకో. లేదా నేనే చూస్తాను. గృహప్రవేశం మా ఇంట్లోనే. అయ్యరుగారు నా మాట వింటారు. ఆయన చాలా మంచివారు."

'కుట్టీ - అన్నం తిందువుగాని, ముఖం కాళ్లూ కడుక్కొని రా అమ్మా' అని ముద్దుగా ఆ పిల్లను పెరట్లోకి తీసుకొని వెళ్ళింది సుగంధి. మళ్ళీ హాల్లోకి రాగానే,

"ఇదుగో సుగంధీ! నన్ను చెడ్డవాడనుకోనేవు. ఇంకో పదినిముషాలకంటే నేను ఎక్కువ ఉండకూడదు సుమా! ఎవరైనా వస్తే బావుండదు. ఏదైనా పని ఉండి అయ్యరుగారు వస్తే ఎంత అప్రదిష్ట? చూడూ ఒకటడుగుతాను కోపగించుకోకు. అసహ్యించుకోకు. నా బాకీ తీర్చకూడదా? నేనిచ్చిన ముద్దులు. పోనీ, కొన్నైనా నాకిచ్చేయకూడదా?"

చంటిపిల్లాడు అల్లరి చేస్తే చల్లగా నవ్వే తల్లిలా మూతిబిగబట్టి నవ్వింది సుగంధి. తర్జనితో బెదిరింపుగా ముక్కుమీద వేలేసుకుంది. ఆ తర్వాత కుడిచేతి తర్జని పెదవి మూలకు చేర్చి ఒకవైపు లాగి

"చూశావా, చూశావా, రెండు పళ్ళు ఊడిపోయాయి. ఇంకా ఏముంది నాలో? ముసలమ్మనై పోయాను. చూడు చక్కిలం. నీవింకా చిన్నపిల్లాడివే ననుకుంటున్నావు. తల్లికాగానే ఆడవాళ్లు లోకాన్ని తల్లిలాగానే చూడాలనుకుంటారు. మారిపోతారు. అమ్మో, నా కాంతి, నా కణ్ణన్ ఏమైపోతారు? చూడు. నీకొకటి చెపుతాను. ఈ లోకంలో తల్లిలాగా మగణ్ణి చూసుకొనే భార్యా, కూతురునిలాగా పెళ్లాన్ని చూసుకొనే భర్తా అపురూపమైన అదృష్టం. జన్మజన్మాల పుణ్యం. చక్కిలం అన్నానని నవ్వొస్తున్నదా! మరీ పసిపిల్లనుగా ఉన్నప్పుడు నిన్ను శేఖరం అనలేక చక్కిలం అనేదాన్నని మీ అక్కా, మా అమ్మా ఎప్పుడూ చెప్పుకుంటూ నవ్వేవాళ్లు కదా! 'ఏమే, వాణ్ణి నమిలి తింటావుటే' అని పాటీ నవ్వేది. అప్పట్లో అలానే ఉండేదేమో! పాటీ పోయిందని టెలిగ్రాం రాగానే నా నవనాడులూ కుంగిపోయినాయి. కుమిలి కుమిలి ఏడ్చాను- నిన్ను వదిలిపెట్టి వెళుతున్నందుకు, అదీకాక నేను మాట తప్పినందుకు. అదలాగా అయిపోయింది. పాటీ కర్మాంతరాలు కాగానే నా పెళ్లి నిశ్చయించారు. మా పాటీనే ఆ సంబంధం కుదిర్చిందట. అక్కడ వాళ్లందరి మధ్యా నేను ఒంటరిదాన్నైపోయాను. నాకు అయ్యరుగారిని చేసుకోవడం ఇష్టంలేదని మా అమ్మా నాన్నలకు చెప్పినా లాభం లేకపోయింది. మాలో పెళ్ళికి చాలా నగలు పెట్టాలి పుట్టింటివాళ్లు. మేం నీకు మంచి వరుణ్ణి తేలేం. అదీకాక మమ్మల్ని నీ దగ్గరే ఉంచుకునేందుకు తెలేని వాళ్ళు ఇష్టపడరు. ఇది మనకు తెలిసిన సంబంధం. కుర్రవాడు చక్కనివాడు. బుద్ధిమంతుడు. నీవంటే చాలా ఇష్టపడుతున్నాడు అని నా మెడలు వంచారు.

ఇక వేరే మార్గం లేకపోయింది. అదీకాక నీవు ఆ రోజే వెళ్ళి ఉద్యోగంలో చేరాలి కదా. నేను రాజుపేట వచ్చినా నువు వుండవు. నా దగ్గరకు నువ్వెలాగూ రాలేవు. అదలాఉంచు. మావారు పెళ్ళైననాటి నుంచీ నా మీదే పంచ ప్రాణాలూ పెట్టుకున్నారు. ఇదంతా నా అదృష్టమే

నని ఆయనకు తిరుగులేని నమ్మకం. ఎంతగా వద్దని చెప్పినా వినకుండా ఆ హోటలు పేరు అలా పెట్టారు. నలుగురి నోళ్ళలో పడటం నాకిష్టం లేదన్నా వినలేదు. ఏం, అలా ఎందుకనుకోవాలి? అమ్మవారి పేరు అనుకోకూడదా! తంజావూరులో సుబ్బరామయ్యరు మంగళాంబికావిలాస్ పెట్టి లక్షాధికారి కాలేదా? మాయూరంలో శివగామి విలాస్ పెట్టి వైద్యనాథన్ బాగుపడలేదా? నిజంగా అమ్మవారే నిన్ను నాకిచ్చింది. అందుకని ఈ పేరే పెడతాను. నీవు నాచేయి పట్టుకోగానే నా జీవితం పచ్చబడింది-అంటూ ప్రతి విషయంలో నా సలహా అడుగు తారు అయ్యరుగారు. ఆయనంత మంచివారు మరొక రుండరు. ఇప్పు డాయనే వచ్చినా మనం ఇరుగుపొరుగున చిన్నప్పుడు కలిసి ఉన్నా మని చెపితే ఎలాంటి కల్మషం లేకుండా నిన్ను ఆదరిస్తారు. అంతదాకా ఎందుకు నువ్వే చూదువు గాని. రేపు ఆయన నిన్ను వెంటబెట్టుకుని రాకపోతే నా పేరు సుగంధి కాదు. ఇదుగో మా అమ్మణ్ణిమీద ఒట్టేసి చెపుతున్నాను. నీకు మాత్రం మరెవరు ఉన్నారు? నేనే కదా నీకు దిక్కూ- దివాణమూ. నా మాట విను. పెళ్ళి చేసుకో. ఇంకా ఎప్పుడు చేసుకుంటావు? ఒంటరితనం దారం లేని గాలి పడగ లాంటిది. అలా ఎందుకుంటావు? నువ్విప్పుడెక్కడికీ వెళ్ళవద్దు. నీ సంగతి అయ్యరు గారికి చెప్పానంటే ఆయనే చూసుకుంటారు."

శేఖరం కళ్ళు తడి అయినాయి.

సుగంధి అదేమిటి అదేమిటి అంటూ ఉంటే చేతులు జోడించాడు శేఖరం.

ఒళ్లో నిద్రపోతున్న పిల్లను బుజం మీదకు తీసుకుని సుగంధి లేచి నిలబడగా గేటుదాటి వీధిలోకి వచ్చాడు శేఖరం. రైలు పట్టాల గేటుకు దిగువన మర్రిచెట్టు దగ్గరకు వచ్చేసరికి కాస్త ఆలస్యంగా ఆకాశంలోకి విహారానికి వచ్చిన పాడ్యమి చంద్రుడు కనపడిన మేరా పట్టాల మీద వెండిపూత పూస్తున్నాడు. వెన్నెల వెన్నెల వెన్నెల. లోకాన్నంతా స్నపితం చేస్తున్నది.

(ఇండియా టుడే - 1994)